**Cambridge International Examinations**
Cambridge International Advanced Level

**TELUGU** **9690/02**

Paper 2 Reading and Writing **October/November 2015**

**1 hour 45 minutes**

INSERT

*0604681881-I*

**READ THESE INSTRUCTIONS FIRST**

This Insert contains the reading passages for use with the Question Paper.

You may annotate this Insert and use the blank spaces for planning.
This Insert is **not** assessed by the Examiner.

**ముందుగా ఈ సూచనలను చదవండి**

ఈ లోకూర్పు (ఇన్‌సర్ట్)లో ప్రశ్న పత్రంతో ఉపయోగించ వలసిన రెండు పఠన ఖండికలు ఉన్నాయి.

మీరు ఈ లోకూర్పును వ్యాఖ్యానించ వచ్చు.  ఖాళీ స్థలాన్ని మీ ప్లానింగ్ కొరకు వాడుకో వచ్చు.
ఈ లోకూర్పును పరీక్షకులు మూల్యాంకనం **చేయరు.**

This document consists of **3** printed pages and **1** blank page.

DC (ST/JF) 104385/2
© UCLES 2015

CAMBRIDGE
International Examinations

**[Turn over**

## విభాగం 1

**పాఠ్యం 1**ని చదివి, ప్రశ్న పత్రం లోని **1, 2, 3** **ప్రశ్నలకు** సమాధానాలు రాయండి.

**పాఠ్యం 1**

### విజ్ఞానయాత్ర

మంజుల తన తోటి విద్యార్థినీ విద్యార్థులతో కలిసి అమరావతి విజ్ఞానయాత్రలో పాల్గొనటానికి సిద్ధం అవుతున్నది. కిందటి సంవత్సరం జరిగిన హంపి విజ్ఞానయాత్రలో తన అక్క పెళ్ళి కారణంగా ఆమె పాల్గొనలేదు. ఈ సంవత్సరం తప్పని సరిగా పాల్గొనాలి అని ఆమె నిర్ణయించుకున్నది. అందుకు కారణం ఈ సంవత్సరంతో ఆమె పాఠశాల చదువు పూర్తి అవుతుంది. తర్వాత కళాశాల చదువు. అందువల్ల తన స్నేహితులతోనూ, స్నేహితురాళ్ళతోనూ కలిసి విజ్ఞానయాత్రలో పాల్గొనే ఈ చివరి అవకాశాన్ని ఆమె వదులుకో దలచుకో లేదు. అమరావతి అంటే ఆమెకు ఎంతో ఇష్టం అనేది కూడా మరొక కారణం. అమరావతితో ఆమెకు ఒక అనుబంధం ఉంది: ఆమె నాన్నగారి ఉద్యోగం కారణంగా వాళ్ళ కుటుంబం మూడు సంవత్సరాల క్రితం కొన్నేళ్ళు గుంటూరులో ఉంది. అప్పుడు వాళ్ళు చాలా తరచుగా అమరావతికి వెళ్ళివస్తూ ఉండేవాళ్ళు. అక్కడ కృష్ణా నదిలో పడవ మీద ప్రవాహాన్ని దాటి ఇసుక తిన్నెల మీదికి వెళ్ళి చాలా సమయం గడిపేవాళ్ళు. అది ఆమెకు ఎంతో ఇష్టంగా ఉండేది.

ఈ విజ్ఞానయాత్రను తరగతిలో ప్రకటించిన ఉపాధ్యాయుడు అమరావతిని గురించి కొన్ని విషయాలు చెప్పారు: అమరావతి గుంటూరు జిల్లాలో గుంటూరు నించి 35 కిలోమీటర్ల దూరంలో కృష్ణా నది ఒడ్డున ఉన్న ఒక పెద్ద గ్రామం. క్రీ.పూ. 2వ శతాబ్దం నించి క్రీ.శ. 2వ శతాబ్దం వరకు పరిపాలించిన శాతవాహనులకు ముఖ్య పట్నంగానూ, గొప్ప బౌద్ధమత కేంద్రంగానూ చరిత్రలో ప్రసిద్ధి పొందింది. ఆ కాలంలో అక్కడ ఒక గొప్ప బౌద్ధ స్తూపం నిర్మించ బడింది. దానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో కృష్ణానది ఒడ్డున క్రీ.శ. 10వ శతాబ్దానికి పూర్వపుది అయిన ఒక ప్రసిద్ధ శివాలయం ఉంది.

ఉపాధ్యాయుడు ఈ విషయాలు చెప్పగానే, మంజుల లేచి తనకు అమరావతితో గల పరిచయాన్ని గురించి, అక్కడి కృష్ణా నది అందాలను గురించి చెప్పింది: అమరావతిలో కృష్ణా నది చాలా అందంగా ఉంటుంది. సుమారు నాలుగు కిలోమీటర్ల వెడల్పు ఉంటుంది. అమరావతికి కొంచెం ఎగువన నది రెండు పాయలుగా చీలి నదిలో ఎన్నో బండరాళ్ళు కనిపిస్తూ ఉంటాయి. మధ్యలో పెద్ద లంక ఏర్పడి ఉంటుంది. పాయ దాటగానే అంతా ఇసుక. ఇసుక దాటిన తర్వాత ఒండ్రుమట్టితో కూడిన మెరక ప్రాంతం ఉంటుంది. అందువల్ల రెండో పాయ కనిపించదు. ఈ ఒడ్డు నించి చూస్తే బండరాళ్ళను తప్పించుకుంటూ పారే నీళ్ళు, ప్రవాహానికి అవతల ఇసుక తిన్నెలు, లంక లోని చెట్లు, అస్పష్టంగా కనిపించే అవతలి గట్టు గ్రామం -- ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది.

ఆమె ఇట్లా వర్ణించి చెప్పిన తీరును ఉపాధ్యాయుడు ఎంతో మెచ్చుకున్నారు. ఆయన అక్కడి కృష్ణను గురించి మరొక విషయం చెప్పారు. కృష్ణకు వరదలు వచ్చినప్పుడు ఆ లంక మునిగి నాలుగు కిలోమీటర్ల వెడల్పున ఈ ఒడ్డు నించి ఆ ఒడ్డు వరకు ఒకటే ప్రవాహం. ఆ ప్రవాహం ఉరకలు వేస్తూ, సుళ్ళు తిరుగుతూ చూడటానికి భయంతో కూడిన ఆశ్చర్యం కలిగిస్తూ ఉంటుంది. ఈ విషయాలను విద్యార్థులు ఎంతో ఆసక్తితో విన్నారు.

విద్యార్థు లందరూ ఎదురు చూస్తున్న ప్రయాణ దినం రానే వచ్చింది. ముందుగా నిర్ణయించిన సమయానికి విద్యార్థులు, వారికి తోడుగా ఇద్దరు ఉపాధ్యాయులు స్కూలు బస్సులో అమరావతికి బయల్దేరారు.

© UCLES 2015

## విభాగం 2

ఇప్పుడు **పాఠ్యం 2ను** చదివి, ప్రశ్న పత్రం లోని **4, 5 ప్రశ్నలకు** సమాధానాలు రాయండి.

**పాఠ్యం 2**

### ఆంధ్ర దేశం లోని బౌద్ధారామాలు

ఆ రోజు తరగతిలో చరిత్ర అధ్యాపకురాలు విద్యార్థులకు ఒక విషయం చెప్పారు: వచ్చే వారం విద్యార్థులు ముగ్గురు ముగ్గురు చొప్పున జట్లుగా ఏర్పడి ఆంధ్ర దేశం లోని బౌద్ధారామాలు అనే అంశం మీద ఒక్కొక్క జట్టు పది నిమిషాలు మాట్లాడాలి. అందుకు కావలసిన సమాచారాన్ని పుస్తకాలు చదివి, తెలుసుకొని రావాలి. దీనికి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా స్పందించారు. విద్యార్థులు ఎట్లా తయారు కావాలో తెలియజేస్తూ ఆమె వారికి కొన్ని సూచనలు చేశారు. సమాచారం లభించే గ్రంథాల వివరాలు ఇచ్చి, ఆ పుస్తకా లన్నీ పాఠశాల గ్రంథాలయంలో ఉన్నా యని తెలిపారు. అంతర్జాలం (ఇంటర్‌నెట్)లో కూడా సమాచారం దొరుకుతుం దని వివరించారు.

మర్నాడు గ్రంథ పఠన సమయంలో అధ్యాపకురాలు విద్యార్థులతో గ్రంథాలయానికి వెళ్ళి వారికి ఆయా గ్రంథాల లోనించి విషయ సేకరణ చెయ్యటానికి తోడ్పడ్డారు. గ్రంథాలయంలో ఉన్న సంగణకం (కంప్యూటర్)లో అంతర్జాలం లోని కొన్ని జాలిక (వెబ్‌సైట్)లను తెరిచి విద్యార్థులకు చూపించారు.

ఆనంద, భవాని, సుగుణ మంచి స్నేహితురాళ్ళు. కలిసి గ్రంథ పఠనం చేస్తారు. ఆటల లోనూ, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల లోనూ ముగ్గురూ కలిసే పాల్గొంటారు. సాధారణంగా పాఠశాలలో ఒక్కరే కనిపించటం అరుదు. వాళ్ళ ఇళ్ళు కూడా దగ్గరే. తరచుగా ఒకరి ఇంటికి ఒకరు వెళ్తూ ఉంటారు. పరీక్షలకు తయారు కావటానికీ, హోమ్ వర్క్ చెయ్యటానికీ ఎవరో ఒకరి ఇంటి దగ్గరే కలిసి పనిచేస్తూ ఉంటారు.

ఇప్పుడు వాళ్ళు ముగ్గురూ ఒక జట్టుగా ఏర్పడి గ్రంథాలయంలో పుస్తకాలు చదివి నోట్సు రాసుకున్నారు. భవాని ఇంటి దగ్గర కూర్చొని సంగణకంలో అంతర్జాలం నించి సమాచారం సేకరించారు. కొన్ని బౌద్ధ కేంద్రాలకు సంబంధించిన చిత్రాల ముద్రణ ప్రతులను తీసుకున్నారు. వారికి ఎక్కువ సమాచారం అమరావతి, నాగార్జునకొండల గురించి దొరికింది. దాన్ని ఒక క్రమంలో పెట్టుకుని తరగతిలో మాట్లాడటానికి తయా రయ్యారు. మాట్లాడ వలసిన రోజు వచ్చింది. ఆ రోజున వాళ్ళు తాము సేకరించిన సమాచారాన్ని మూడు భాగాలు చేసుకొని చక్కగా మాట్లాడారు. సేకరించిన చిత్రాలను కూడా ప్రదర్శించారు. వాళ్ళ కృషికి అధ్యాపకురాలి నించి మంచి మెప్పుదల లభించింది.

వాళ్ళు చెప్పిన విషయాల సారాంశం: ఆంధ్ర దేశం అతి ప్రాచీన కాలంలో బౌద్ధ మతాన్ని బాగా ఆదరించిన ప్రాంతం. ఇక్కడి ప్రధానమైన బౌద్ధ కేంద్రాలు అమరావతి, నాగార్జునకొండ, భట్టిప్రోలు, జగ్గయ్యపేట, ఇటీవలే బయట పడిన బావికొండ. వీటిలో గుంటూరు జిల్లా లోని అమరావతి, విశాఖపట్నం సమీపం లోని బావికొండ అతి ప్రాచీనమైనవి. బౌద్ధ మతం లోని వజ్రయాన సంప్రదాయానికి చెందిన గ్రంథాలలో బుద్ధుడు అమరావతిలో కాలచక్ర క్రతువును జరిపా డని చెప్పబడింది. దీనితో అమరావతి ప్రాచీనత క్రీ.పూ. 5వ శతాబ్దికి చెందినదిగా తెలుస్తుంది. ఇక్కడి బౌద్ధస్తూపాన్ని క్రీ.పూ. 2వ శతాబ్దిలో నిర్మించి, 300 సంవత్సరాల పాటు మూడు దశలలో అభివృద్ధి చేశారు అని పురావస్తు పరిశోధకుల అభిప్రాయం. దీన్ని అతి పెద్ద స్తూపంగా వారు గుర్తించారు. ఇది బుద్ధుని జాతక కథలు చిత్రించబడిన అద్భుత మైన సున్నపు రాతి శిల్పాలతో అలంకరించ బడింది. ఇక్కడి శిల్ప పద్ధతి 'అమరావతి శిల్ప పద్ధతి'గా ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఈ పద్ధతి లోనే నాగార్జునకొండ మొదలైన ఇతర ప్రాంతాల లోని బౌద్ధ శిల్పాలు రూపు దిద్దుకున్నాయి. అమరావతి, నాగార్జునకొండలకు చెందిన అత్యంత సుందరమైన శిల్ప కళా ఖండాలు మద్రాసు మ్యూజియమ్ లోనూ, లండన్ లోని బ్రిటిష్ మ్యూజియమ్ లోనూ భద్రపరచ బడి ఉన్నాయి.

© UCLES 2015

**BLANK PAGE**

Permission to reproduce items where third-party owned material protected by copyright is included has been sought and cleared where possible. Every reasonable effort has been made by the publisher (UCLES) to trace copyright holders, but if any items requiring clearance have unwittingly been included, the publisher will be pleased to make amends at the earliest possible opportunity.

To avoid the issue of disclosure of answer-related information to candidates, all copyright acknowledgements are reproduced online in the Cambridge International Examinations Copyright Acknowledgements Booklet. This is produced for each series of examinations and is freely available to download at www.cie.org.uk after the live examination series.

Cambridge International Examinations is part of the Cambridge Assessment Group. Cambridge Assessment is the brand name of University of Cambridge Local Examinations Syndicate (UCLES), which is itself a department of the University of Cambridge.